నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 23 ఫిబ్రవరి 2024 | KARIMNAGAR


ఫర్టిలైజర్‌సిటీ : జనగామలోని గోదావరినది ఒడ్డున గద్దెల వద్ద మొక్కులు సమర్పిస్తున్న భక్తులు


సుల్తానాబాద్‌రూరల్ : నీరుకుల్లలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


కరీంనగర్ : రేకుర్తిలో గద్దెపై సమ్మక్కను ప్రతిష్ఠిస్తున్న కోయ పూజారులు, పక్కన మాజీ ఎంపీ వినోద్‌కుమార్, ప్రజాప్రతినిధులు


కరీంనగర్ : రేకుర్తిలో బంగారం ఎత్తుకుని అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ


వెల్గటూర్ : రాజారాంపల్లిలో సమ్మక్క సారలమ్మను దర్శించుకుంటున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

సమ్మక్క తల్లి గురువారం గద్దెలపైకి చేరుకుంది. దీంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పలు ముఖ్య జాతరలకు భక్త జనం పోటెత్తింది. సమ్మక్క, సారలమ్మ గద్దెలకు చేరుకోవడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. కరీంనగర్ జిల్లాలోని రేకుర్తి, వీణవంక, చల్లూరు, కేశవపట్నం, రంగనాయకులగుట్ట, చొప్పదండి, రామడుగు, కొత్తపల్లి, గంగాధర, తిమ్మాపూర్, మానకొండూర్, కరీంనగర్‌రూరల్ మండలాల్లోని పలు గ్రామాలు, పెద్దపల్లి జిల్లాలోని గోదావరిఖని, జనగామ, గోలివాడ, ఓదెల మండలం కొలనూర్, సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, గర్రెపల్లితోపాటు జిల్లాలోని అన్ని మండలాల్లోని పలు గ్రామాలు, ఎల్లారెడ్డిపేట, ఇల్లంతకుంట, ముస్తాబాద్, వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలాల్లోని పలు గ్రామాలు, జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణం, గొల్లపల్లి మండలం చిల్వకోడూరు, పెగడపల్లి మండలకేంద్రం, ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో జరిగిన జాతరలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆయా చోట్ల మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మక్కాన్ సింగ్, విజయరమణారావు, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తన స్వగ్రామమైన వీణవంకలో ఎత్తు బంగారం ఇచ్చి మొక్కు తీర్చుకున్నారు.

# వన దేవతలకు వందనం

- కొలువుదీరిన సమ్మక్క
- తల్లీబిడ్డలకు జనహారతి
- పోటెత్తిన జాతరలు
- దర్శనం కోసం బారులు తీరిన భక్తులు
- నేడు పెద్దసంఖ్యలో తరలివచ్చే అవకాశం

"జంపన్న వాగుల్లో అబియా.. జాలారు బండల్లా అబియా..
నా తల్లి సమ్మవ్వా అబియా.. నీకు పదివేల దండాలే అబియా.."

..ఇలా అబియ రాగాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లు, భక్తుల జేజేల నడుమ సమ్మక్క తల్లి గురువారం సాయంత్రం గద్దెనెక్కింది! ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో జరుగుతున్న జాతరలో బిడ్డ సారలమ్మతో కలిసి కొలువుదీరగా, ఒక్కసారిగా జనప్రవాహం పోటెత్తింది. రెండేళ్లుగా ఎదురు చూసిన భక్తులకు కన్నుల పండువగా తల్లి దర్శనమిచ్చింది. ఒడిబియ్యంతో తరలివచ్చిన మహిళలు, ఇద్దరమ్మలకు కుంకుమ, పసుపు, బంగారం(బెల్లం) సమర్పించి, పిల్లాపాపను, గొడ్డూ గోదను చల్లంగ చూడాలని వేడుకున్నారు. కాగా, గద్దెలపైకి చేరిన వనదేవతలిద్దరినీ దర్శించుకునేందుకు నేడు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు.

- కమాన్‌చౌరస్తా/ శంకరపట్నం/ హుజూరాబాద్‌టౌన్/ వీణవంక, ఫిబ్రవరి 22


కరీంనగర్ : రేకుర్తిలో కోడి పుంజును ఎగరేస్తున్న భక్తుడు


వీణవంక : ఎత్తు బంగారం సమర్పిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి


కరీంనగర్ : రేకుర్తిలో గద్దెపైకి సమ్మక్కను తీసుకువస్తున్న కోయపూజారులు


కరీంనగర్ : రేకుర్తిలో సమ్మక్క-సారలమ్మను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తజనం

# జీతాలూ మహాప్రభో

- కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు నిలిచిన వేతనాలు
- రెండు నెలలుగా ఎదురుచూపులు
- కుటుంబ పోషణకు కష్టాలు
- ఇచ్చిన హామీ నిలుపుకోవాలంటున్న అంగన్‌వాడీలు

'ఓడెక్కె దాకా ఓడ మల్లన్న.. ఓడ దిగినంక బోడి మల్లన్న' అన్నట్టుగా ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. శాసనసభ ఎన్నికలకు ముందు ఇష్టారాజ్యంగా హామీలు గుప్పించిన ఆ పార్టీ, ఇప్పుడు అమలులో మాత్రం చోద్యం చూస్తున్నది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచడంతోపాటు ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏ నెలకు ఆనెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చినా.. తీరా గెలిచిన తర్వాత జీతాలు పెంచడం దేవుడెరుగు? ఉన్న జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు. ఫలితంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురు చూడాల్సి వస్తున్నది.

- కరీంనగర్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ కలెక్టరేట్



### నాడు ఆదుకున్న కేసీఆర్ సర్కారు

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, ఆరేళ్లలోపు బాలలకు ఆటాపాటలతో కూడిన పూర్వ ప్రాథమిక విద్యనందిస్తున్నారు అంగన్‌వాడీలు. అలాగే, ప్రభుత్వం నిర్వహించే పలు సర్వేలు, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు కూడా చేస్తుంటారు. అయినా నాటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయి. వేతనాలు పెంచాలని అనేక ఆందోళనలు చేసినపుడల్లా కంటితుడుపుగా ₹వందో లేక ₹200లో పెంచేవారు. దీంతో అవి ఏ మూలకూ సరిపోక ఇబ్బంది పడేవారు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఆ పరిస్థితి మారింది. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించే కీలకమైన సేవల్లో ఉన్న అంగన్‌వాడీలకు సముచిత స్థానం కల్పించింది. కేంద్రంతో సంబంధం లేకుండా ఈ చిరుద్యోగుల సంక్షేమాన్ని చూసుకున్నది. తెలంగాణ వచ్చినప్పుడు అంగన్‌వాడీ టీచర్లకు కేవలం ₹3,200, హెల్పర్లకు ఇంకా తక్కువ వేతనం ఉండగా, రాష్ట్రం వచ్చిన వెంటనే వీరికి వేతనాలు పెంచింది. టీచర్లకు నెలకు ₹13,650, హెల్పర్లకు ₹7,800 వేతనం అందించింది. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంతగా వేతనాలు పెంచలేదు. ఆ తర్వాత ప్రభుత్వోద్యోగులకు ఇస్తున్నట్టుగా రెండు సార్లు పీఆర్‌సీ అమలు చేసింది. అయితే, కరోనా విపత్కర కాలంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా.. సంక్షేమాన్ని మాత్రం ఆపలేదు. ఉద్యోగులకు అటో ఇటే వేతనాలు కాస్త ఆలసమయ్యాయి కానీ, ఏ నెల కూడా వేతనాలు ఆపలేదు.

### నేడు జీతాల కోసం ఎదురుచూపు

ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఎన్నో హామీలిచ్చింది. తాము అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని, ప్రభుత్వోద్యోగులతో కలిపి ఏనెలకు ఆ నెల విడుదల చేస్తామంటూ హామీ ఇచ్చింది. ఇంకా ఒకటో తారీఖే వేస్తామని చెప్పింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 75 రోజులు గడిచింది. కానీ, ఇప్పటికీ వరకు అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు జీతాలు విడుదల చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 35 వేల సెంటర్లలో పనిచేస్తున్న దాదాపు 65 వేల అంగన్‌వాడీలు రెండు నెలలుగా జీతాల కోసం ఎదురుచూస్తున్నారు. జీతాలు పెంచడమేమో గానీ, ఉన్న జీతాలు కూడా సక్రమంగా పంపిణీ చేయడం లేదని మండిపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఏరు దాటినంక తెప్ప తగలేసిన చందంగా వ్యవహరిస్తున్నదని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ప్రస్తుతం తమ పరిస్థితి పెనంపై నుంచి పొయ్యిలో పడ్డట్టుగా మారిందని కన్నీటి పర్యంతమవుతున్నారు. జీతాలు లేక తమ కుటుంబాల పరిస్థితి కడుదయనీయంగా మారతున్నదని, అప్పులు చేయాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ఎదుర్కొంటున్న పరిస్థితులపై కాంగ్రెస్ పార్టీ నాయకుల ఎదుట అయినా గోడు వెళ్లబోసుకుందామంటే, కనీసం వారిని కలిసే సమయం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమకు సత్వరమే జీతాలు విడుదల చేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

# సహకార రంగానికి పూర్వవైభవం రావాలి

- వ్యవసాయరంగానికి వెన్నుదన్నుగా నిలువాలి
- ప్రజలకు అనుగుణంగా కార్యకలాపాలు విస్తరించాలి
- బెంగళూర్‌లో దక్షిణాది రాష్ట్రాల సహకార బ్యాంకుల సదస్సులో నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

కరీంనగర్, ఫిబ్రవరి 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నేషనల్ ఫెడరేషన్ ఆఫ్‌సెట్ కో-ఆపరేటివ్ బ్యాంక్స్ లిమిడెట్ (ఎన్‌ఏఎఫ్‌ఎస్‌సీవోబీ) చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అధ్యక్షతన గురువారం బెంగళూర్‌లో దక్షిణాది రాష్ట్రాల సహకార బ్యాంకుల సదస్సు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర సహకార శాఖ మంత్రి రాజన్న సహకారంతో జరగ్గా.. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా వెలుగు వెలిగిన సహకార రంగానికి, రానున్న కాలంలో పూర్వవైభవం కల్పించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై ఈ సదస్సులో చర్చించారు. అందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా వ్యవసాయరంగానికి వెన్నుదన్నుగా నిలువాలని, భవిష్యత్‌లో 50 శాతం వరకు రుణాలు అందించేందుకు ప్రయత్నాలు జరగాలని, 2047 నాటికి సహకార రంగంలోని బ్యాంకులు దేశ జీడీపీలో కీలక పాత్ర పోషించాలని, అందుకు ఇప్పటినుంచే కార్యాచరణ ఉండాలన్న అంశంపై చర్చించారు. ఈ వివరాలను రవీందర్‌రావు వెల్లడించారు. ఇంకా జిల్లాల్లో సహకార బ్యాంకుల సేవలను విస్తరించడంతోపాటు వ్యవసాయంతోపాటు ఇతర వాణిజ్య కార్యకలాపాలకు రుణాలు మంజూరు చేసి అన్ని వర్గాలకు అండగా నిలువడం, బ్యాంకు మనుగడతోపాటు అభివృద్ధి కోసం కావాల్సిన డిపాజిట్ల సేకరణపై దృష్టిపెట్టడం, సహకార సంఘాల ద్వారా వ్యాపార కార్యకలాపాలు విస్తరిస్తూ ఆయా వర్గాల మన్ననలను పొందడం, అదే విధంగా ప్రభుత్వానికి సంబంధించిన కరెంటు ఖాతాలతోపాటు స్థానిక సంస్థలు, దేవాదాయ శాఖ ఖాతాలను సహకార బ్యాంకు శాఖల్లో ఖాతాలను తెరిచేందుకు ప్రభుత్వాన్ని కోరాలని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ సమావేశంలో నాఫ్స్‌కాబ్ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యంతోపాటు దక్షిణాది రాష్ట్రాల సహకార బ్యాంకుల అధ్యక్షులు, మేనేజింగ్ డైరెక్టర్లు, జిల్లా బ్యాంకుల అధ్యక్షులు, ముఖ్య కార్య నిర్వహణాధికారులు, కర్ణాటక రాష్ట్ర బాంకు అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.


బెంగళూర్ సదస్సులో కర్ణాటక ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కొండూరి రవీందర్‌రావు

# గ్యారెంటీలను అమలు చేయాలి

- ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి
- ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో బండి చేసేదేమీ లేదు
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజం

మల్యాల, ఫిబ్రవరి 22 : కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేసి, ఇచ్చి మాటకు కట్టుబడి ఉండాలని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాలకు కాంగ్రెస్ 17 గెలిచి కేంద్రంలో అధికారంలోకి వస్తేనే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని సీఎం అంటున్నారని దుయ్యబట్టారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ నుంచి వినోద్‌కుమార్‌ను మరోసారి గెలిపిస్తే ఈ ప్రాంత సమస్యలన్నింటినీ పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా మారి పరిష్కారం చూపుతారని చెప్పారు. మల్యాల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది పూర్తయ్యేలోగా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేసి, నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో నీరందక పంటలు ఎండిపోతున్నాయని, కరెంట్ కోతలు మొదలయ్యాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం సాగునీరు, నిరంతర కరెంట్ ఇచ్చి రైతులకు అండగా ఉండాలని సూచించారు. కరీంగనర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్ ఉన్న సమయంలో కరీంనగర్‌ను స్మార్ట్ సిటీ జాబితాలో చేర్చి అభివృద్ధి దిశగా చర్యలు చేపట్టారని, కొత్తపల్లి-మనోహరాబాద్‌కు ప్రత్యేక లైన్ మంజూరులో చొరవ చూపారని, ప్రస్తుతం ఆ మార్గంలో సిద్దిపేట వరకు రైలు ప్రయాణాలు ప్రారంభమయ్యాయన్నారు. అనంతరం మానాలలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. తర్వాత ఇటీవల దుబాయి నుం చి క్షమాభిక్షపై స్వదేశానికి వచ్చిన మానాలకు చెందిన శివరాత్రి హన్మంతును కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జనగం శ్రీనివాస్, జడ్పీటీసీ కొండపలుకుల రాంమోహన్‌రావు, సహకార సంఘాల అధ్యక్షులు అయిల్నేని సాగర్‌రావు, బోయినిపల్లి మధుసూదన్‌రావు, బీఆర్ఎస్ నాయకులు మిట్టపల్లి సుదర్శన్, గడ్డం మల్లారెడ్డి, బద్దం తిరుపతి రెడ్డి, అజహరొద్దీన్, బద్దం తిరుపతి, దూస వెంకన్న, బోడ గోవర్ధన్, గాజుల రాములు, పోతురాజు శ్రీనివాస్, రియాజ్, అలంకార్, రంజిత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

### బండి.. ఎన్ని నిధులు తెచ్చినవ్?

కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వానికి ఏం చేసిందో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ చెప్పాలి. ప్రజా సంగ్రామ యాత్ర చేపట్టిన ఆయన నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారో ప్రకటించాలి. రాష్ట్రంలోని ఏ ప్రాజెక్టుకైనా జాతీయహోదా కల్పించారా..? కొండగట్టు అంజన్న ఆలయానికి ఎన్ని నిధులు తెచ్చారు? తెలంగాణకు ఎన్ని జాతీయ రహదారులు, ఎన్ని రైల్వే లైన్లు మంజూరు చేయించారు? చెప్పాలి. ప్రతి ఎన్నికల సందర్భంలో ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవడం తప్ప చేసిందేమీ లేదు. ప్రస్తుతానికి రాష్ట్రంలో సమ్మక్క జాతర నడుస్తున్నది. కనీసం దానిని జాతీయ జాతరగా గుర్తించి, నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలి.

- సుంకె రవిశంకర్